క్లుప్తంగా

పనులు సకాలంలో పూర్తిచేయాలి



అధికారులకు సూచనలిస్తున్న నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

మద్దికెర : పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తి చేయాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రధాన బజారులో నాబార్డు నిధులు రూ.15 లక్షలు, కంట్రిబ్యూషన్ రూ.3 లక్షలతో చేపట్టిన మార్కెట్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాబార్డు నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజల సహకారం కావాలన్నారు. సంబంధిత అధికారులు పనులు పరిశీలిస్తూ సూచనలు ఇవ్వాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఎంపీడీఓ అలివేలమ్మ, సర్పంచ్ సుహాసిని, బ్యాంకు మేనేజర్ వెంకటేశులు, అంజనేయులు ఏపీఎం నరసింహులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో కలశాలతో మహిళలు, చిన్నారులు

దేవనకొండ: మండల కేంద్రంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠలో భాగంగా గురువారం శ్రీ లక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి విగ్రహాల ఊరేగింపు వేడుకగా జరిగింది. విగ్రహాలను పల్లకీలో ఆశీనులుగావించి ఊరేగించగా..చిన్నారులు కలశాలతో ముందు నడిచారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 1:30 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉంటుందని గ్రామపెద్దలు తెలిపారు.

విద్యుత్ ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన ముల్లా మస్తాన్‌వలి

దేవనకొండ: మండల కేంద్రంలోని టర్నింగ్ వద్ద ఓ యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలు..మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ముల్లా మస్తాన్‌వలి దేవనకొండ టర్నింగ్ వద్ద బైక్ మెకానిక్ పని, పిచికారీ పంపులు రిపేరీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం షాపును ఖాళీ చేయగా, గురువారం షాపునకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్ తొలగించే క్రమంలో షాపుపైన ఉన్న కరెంట్ తీగ తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

విద్యా ప్రమాణాలపై శ్రద్ధ వహించాలి



రాతన గిరిజన పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఆర్డీవో రామలక్ష్మి

తుగ్గలి : విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. మండలంలోని రాతన సమీపంలోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలు చదివించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. విద్యార్థులకు చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ రావాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

వెల్దుర్తి ఎస్‌ఐగా జి.అశోక్



వెల్దుర్తి: నూతన ఎస్‌ఐగా జి.అశోక్‌ను నియమిస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు వెలువడ్డాయి. బొమ్మిరెడ్డిపల్లెలో జరిగిన హత్య అనంతరం నుంచి ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సునీల్ కుమార్‌ను ఓర్వకల్లు మండలానికి బదిలీ చేశారు. నంద్యాల జిల్లా పాములపాడులో ఎస్‌ఐగా పనిచేస్తున్న అశోక్ ఇక్కడికి బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి: మండలంలోని ఎల్ నగరం సబ్‌స్టేషన్ పరిధిలోని ఎల్ నగరం, దాసరదొడ్డి తండా, ఎల్ తండా, యాదరాళ్ల గ్రామాలకు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ల నిర్వహణలో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. రైతులకు తెల్లవారుజాము 5 నుంచి 10గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.



నగరడోణలో వాడుముఖం పట్టిన పత్తిలో గుంటక పాస్తున్న రైతు నాగన్న



నేమకల్లులో ఎదుగుదల లోపించిన వేరుశనగ



దొల్తాపురంలో ఎదుగుదల లేని కంది పంట

కోరలు చాస్తున్న కరువు!

- 40 రోజులు దాటినా అదునైన వాన లేని వైనం
- విత్తు వేసినప్పటి నుంచి రైతన్నల ఎదురుచూపు
- మొలకదశలోనే ఎండుతున్న పంటలు
- పెట్టుబడి సాయం అందజేయని ప్రభుత్వం
- 50 శాతం కూడా దాటని ఖరీఫ్ సాగు
- పరిస్థితి కొనసాగితే అన్నదాతకు భారీ నష్టం
- ప్రత్యామ్నాయ చర్యలపై సర్కారు మౌనం



రామదుర్గంలో వాడుతున్న పత్తి పైరు

చిప్పగిరి: గత ఐదేళ్లుగా రైతన్న పట్టిందంతా బంగారమే. నాలుగేళ్లపాటు విస్తారంగా వర్షాలు కురవడంతో ఖరీఫ్‌లో పంటలు సమృద్ధిగా పండించుకున్నారు. మే, జూన్ నెలల్లో కురిసిన భారీ వర్షాలు అన్నదాతల్లో ఆశలు రేపాయి. ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయకపోయినా పంటలు సాగు చేశారు. అప్పుడు ముఖం చాటేసిన వరుణుడు నేటి వరకు జాడలేదు. అప్పుడప్పుడు చినుకులు రాలుతున్నా.. అవి పంటలకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. ఇక పూర్తిస్థాయిలో పంటలు సాగవలేదు. మిగిలిన రైతులు విత్తనానికి కావలసినవన్నీ సిద్ధం చేసుకొని అదునైన వర్షం కోసం ఆకాశం వంక చూస్తున్నారు. మంగళవారం వర్షం కురిసినా పంట ఎదుగుదలకు, సాగుకు సరిపడదని కర్షకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే తాగునీటి ఇబ్బందులు తగ్గడంలేదు. మరోపక్క సాగునీరు లేక కరువుఛాయలు విస్తరిస్తున్నాయి. మరో పదిరోజులు ఇలాగే కొనసాగితే ఖరీఫ్ సీజన్ పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితులు చేయిదాటుతున్నా ప్రత్యామ్నాయ చర్యలపై ప్రభుత్వంలో స్పందన కొరవడింది.

నగం కూడా సాగవని పొలాలు..

మండలంలో ఖరీఫ్ ప్రారంభంలో అరకొరగా కురిసిన వర్షాలకు కంది, వేరుశనగ, పత్తి, సజ్జ, మిరప, కొర్ర తదితర పంటలు సుమారు 3వేల హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 7వేల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 3వేల హెక్టార్లకు దాటలేదు. అంటే సగం విస్తీర్ణంలో కూడా పంటలు సాగు చేయలేదు. విత్తనం వేసిన తరువాత మంచి వర్షం పడలేదు. దీంతో పొలాలను దాటి పైర్లు ఎదగలేదు. అలాగే గాలులు అధికంగా ఉండటంతో పైర్లు వేగంగా వాడుతున్నాయి. అయినా ఆశ చావక.. చాలా మంది రైతులు వాటిల్లోనే అంతరసేద్యం చేస్తున్నారు. ఇక ఇప్పటి వరకు సాగు చేసిన పంటలకు ఎకరాకు రూ.10వేలకు పైగా ఖర్చు చేశారు. వరణుడు కరుణించకపోతే పంటలు చేతికందుతాయో లేదోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి సాయమేదీ?

పంటల సాగుకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు రూ.13,500 పెట్టుబడి సాయంగా అందజేసింది. దీంతో నాడు వారికి పెట్టుబడికి అవస్థలుండేవి కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు పెట్టుబడి సాయం గురించి కనీస ప్రస్తావన లేదు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయంగా అందజేస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించినా నేటికీ అందజేయకపోవడంతో రైతన్నలు పంట సాగుకు అయిన చోటల్లా చేతులు చాచాల్సి వస్తుంది. ఓ వైపు బ్యాంకులు రుణాలు ఇవ్వక, మరో వైపు అప్పు పుట్టక వారి అవస్థలు వర్ణనాతీతం. ఏదో ఒకలా చేసి పంట సాగు చేస్తే వానలు లేకపోవడం వారికి ఆశనిపాతమైంది. చివరకు ప్రభుత్వమైనా ఆదుకుంటే బాగుంటుందని ఆశగా ఎదురుచూస్తున్నా అటువైపు కనీస ప్రతిస్పందన కొరవడింది.

పంటల నమోదు ప్రారంభమైంది



ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల నమోదు కార్యక్రమం ప్రారంభించాం. మండలంలో 16 గ్రామాల రైతులు తాము వేసిన పంటలు సత్వరమే నమోదు చేసుకోవాలి. పంటల నమోదు కోసం తమ గ్రామ సచివాలయాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని లేదా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలి. భూమి పట్టాదార్ పాస్ బుక్, ఆధార్, మొబైల్ నంబర్‌తో వెళ్లి పంటలు నమోదు చేయించుకోవాలి. పంటల నమోదుపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.

– విజయలక్ష్మి, ఏఓ

కరువు మండలాలుగా ప్రకటించాలి



తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నియోజకవర్గంలో కరువుఛాయలు విస్తరిస్తున్నాయి. నియోజకవర్గంలోని ఆలూరు, చిప్పగిరి, హాళహర్వి, హొళగుంద, ఆస్పరి, దేవనకొండ మండలాల్లో సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా సరైన వర్షం కురవలేదు. దీంతో చాలా మంది రైతులు పంటలు సాగు చేయలేదు. సాగు చేసిన పంటలు కూడా వాడుముఖం పట్టాయి. దీంతో రైతు నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. వెంటనే నియోజకవర్గాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వారిని ఆదుకోవాలి. అలాగే.. ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే అందించాలి. – బుసినే విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

వానల్లేక పంటలు వాడుతున్నాయి



మాకున్న 6 ఎకరాలతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని కంది, మిరప సాగు చేశాం. సాగు చేసిందే మొదలు ఇప్పటి వరకు సరైన వర్షం కురువక పైర్లు వాడు ముఖం పట్టాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అప్పుడప్పుడూ జల్లులు పడుతున్నా పంటకు ఉపయోగపడటం లేదు. ఈ సమయంలో ఓ భారీ వర్షం కురిస్తే సాగు చేసిన పంటలతో పాటు కొత్తగా సాగు చేయడానికి బాగుంటుంది. పంటల సాగుకు డబ్బులు సమకూరక బాగా ఇబ్బందిపడ్డాం. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేస్తే ఒకరి వద్దకు వెళ్లి చేయిచాపాల్సిన అవసరం ఉండదు.

– చాబాల గోవిందు, రైతు, దొల్తాపురం

క్రమశిక్షణ, ఆత్మస్థైర్యంతో లక్ష్యాన్ని సాధించండి



వెల్దుర్తి కేజీబీవీలో నీటి సౌకర్యాన్ని పరిశీలిస్తున్న డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి,

వెల్దుర్తి, కృష్ణగిరి: పరిసరాల, వ్యక్తిగత శుభ్రత, యోగా, మంచి ఆహారం, క్రమశిక్షణతో బాగా చదువుకుని, ఆత్మస్థైర్యంతో ఉన్నత స్థానాలను చేరుకోవాలని డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి సూచించారు. గురువారం ఆమె వెల్దుర్తి, కృష్ణగిరి మండల కేంద్రాల్లోని కేజీబీవీ విద్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికలకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి బాలికలతో మాట్లాడారు. బాల్య వివాహం అసమానతలు, బ్యాడ్ టచ్ తదితర చిన్న సమస్య అయినా తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. పేదింటి నుంచి వచ్చినా తల్లితండ్రులకు పేరుతెచ్చేలా, భవిష్యత్తు బంగారు బాటలా వేసుకుంటూ, పేదరికం రూపుమాపేలా పట్టుదలతో ఇష్టంగా చదవుకోవాలన్నారు. రికార్డుల పరిశీలనానంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బాలికలకు చదువుతో పాటు సమాజంలో సమస్యలను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని కోరారు. వెల్దుర్తి కేజీబీవీకు కాంపౌండ్ వాల్ లేదని ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. కృష్ణగిరి ఎస్ఓ చైతన్య స్రవంతి, వెల్దుర్తి ఇన్‌చార్జ్ ఎస్ఓ మంజుల, ఎస్ఐ సునీల్‌కుమార్ ఉన్నారు.

విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

వెల్దుర్తి: విధులను బాధ్యతగా నిర్వర్తించాలని డీపీఓ నాగరాజు నాయుడు సచివాలయ, పంచాయతీ ఉద్యోగులకు సూచించారు. గురువారం మండలంలోని నర్సాపురం గ్రామ సచివాలయం, ఆర్ఎస్‌కేలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ఓడీఎఫ్ ప్లస్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వే వందశాతం చేయాలన్నారు. రైతు పథకాల అమలుపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. నర్సాపురం, వెల్దుర్తి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి వర్మీకంపోస్టు తయారీ కొనసాగించాలని ఆదేశించారు. ఈఓఆర్డీ నరసింహులు, వెల్దుర్తి ఈఓ నాగేశ్వరరావు, నర్సాపురం సర్పంచ్ ఈరమ్మ ఉన్నారు.



నర్సాపురం సచివాలయంలో సిబ్బందికి ఆదేశాలిస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

28 మంది నిందితుల అరెస్టు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయల మార్కెట్లో ఈనెల 5న ఘర్షణకు పాల్పడిన వైఎస్సార్ సీపీకి చెందిన 28 మంది నిందితులను ఆస్పరిలో గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మన్న తెలిపారు. వారిలో ధనుంజయ, సురేంద్ర, రంగన్న, మల్లప్ప, రాజశేఖర్‌తో పాటు మరో 23 మందిని అరెస్టు చేశామని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

హాలహర్వి: బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు గురువారం మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూమిపూజ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రహ్లాదరెడ్డి, మాజీ సర్పంచ్ నాగేంద్ర, బి.నరసప్ప, గ్రామపెద్దలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. హనుమంతరెడ్డి, గుమ్మనూరు లక్ష్మీకాంత, నారాయణరెడ్డి, గాదిలింగ, మాజీ ఎంపీటీసీ ప్రకాష్ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం

ఆలూరు: చిన్నారులకు తల్లిపాలు అమృతంలాంటివని ఆలూరు ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా హత్తిబెళగల్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బదిలీ

తుగ్గలి : పత్తికొండ డీఎస్పీ పి. శ్రీనివాసరెడ్డి బదిలీ అయ్యారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అలాగే.. మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జీ. కృష్ణమూర్తి తుగ్గలి ఎస్ఐగా, కర్నూలు సీఐడీలో విధులు నిర్వహిస్తున్న పి. శ్రీనివాసులును జొన్నగిరి ఎస్ఐగా నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు తుగ్గలి ఎస్ఐగా ఉన్న మల్లికార్జున వీఆర్ఎస్పీకి, జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు ఆదోని రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

స్పింక్లర్ల చోరీ

మద్దికెర : మండలంలోని ఎడవలి గ్రామానికి చెందిన గోపాల్ అనే రైతుకు చెందిన పొలంలో 14 స్ప్రింక్లర్లు చోరీ కావడంతో దాదాపు రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు గురువారం తెలిపారు. వేరుశనగ పంట సాగు చేశానని నీరు పెడదామని ఉదయం పొలానికి వెళ్లగా పైపులు కనిపించకపోవడంతో దొంగతనానికి గురైనట్లు గుర్తించానన్నారు. పంట చేతికందే సమయంలో ఇలా పైపులు ఎత్తుకెళ్లడం వల్ల నీరు కట్టకపోతే పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

తుగ్గలి : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని సీహెచ్‌వో అన్నపూర్ణ అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహ కల్పించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నిర్మూలన గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశా కార్యకర్త ఆనందమ్మ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకంలో జరిగిన ప్రతి పనికి సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఎస్ఆర్‌పీ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని ఎస్‌హెచ్ఎర్రగుడి, కోయిలకొండ, ఆలంకొండ, కటారుకొండ, కృష్ణగిరి గ్రామాల్లో గురువారం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. మస్టర్ల నిర్వహణలో లోపాలు, పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఏపీఓ శేషిరెడ్డి, ఈసీ చెన్నకేశవులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు





జొన్నగిరిలో నాగదేవతలకు పాలు పోస్తున్న భక్తులు,వెల్దుర్తిలో నాగప్రతిమలకు పాలుపోస్తున్న భక్తులు

తుగ్గలి, పత్తికొండ : నాగుల చవితి వేడుకలు గురువారం పత్తికొండ, తుగ్గలి మండలాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాగుల కట్టలు, పుట్టల వద్ద మహిళలు, పెళ్లైన కొత్త జంటలు ప్రత్యేక పూజలు చేశారు. తమ కుటుంబాలను చల్లగా కాపాడాలని వేడుకున్నారు. చలివిడి ముద్దలు, నూగుల ముద్దలు ప్రసాదంగా ఉంచి మొక్కులు తీర్చుకున్నారు.

వెల్దుర్తి: శ్రావణ శుద్ధ చతుర్థి సందర్భంగా గురువారం నాగుల చవితిని మండలంలోని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టలు, నాగ ప్రతిమలకు పాలు పోసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో నాగుల చవితిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు నాగుల కట్టకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మహిళలు నియమ నిష్ఠలతో ఆయా దేవాలయాల్లో నాగ ప్రతిమలకు పాలుపోసి నైవేద్యం సమర్పించారు.



హొళగుందలో నాగదేవత విగ్రహానికి పూజలు చేస్తున్న మహిళలు

హొళగుంద: మండలంలో గురువారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పిండి వంటలను సమర్పించి పాలు పోశారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

తుగ్గలి(పత్తికొండ) : ప్రతి పంటను విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. గురువారం హోసూరులో రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. బిందు సేద్యానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రిప్, ఇతర పరికరాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డ్, 1బీ, ఎఫ్ఎంబీ, బ్యాంక్ పాస్ బుక్ తీసుకొని సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించి నచ్చిన కంపెనీని ఎన్నుకుని బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని చెప్పారు. పథకం సహాయ సంచాలకులు రాజాకృష్ణారెడ్డి, ఏఓ వెంకటరాముడు పాల్గొన్నారు.

వెల్దుర్తి: ప్రతి రైతు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ అక్బర్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మల్లెపల్లె, రామళ్లకోట గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బంది సాంబశివుడు, అనిల్ పాల్గొన్నారు.

ఎల్లార్తిలో వాగ్వాదం

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి గ్రామంలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఉర్దూ పాఠశాలకు సంబంధించి ఎన్నికలు ప్రశాంతంగా జరుగగా.. మిగిలిన ప్రాథమిక, జెడ్పీ హైస్కూల్ ఎన్నికల విషయంలో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి, దర్గన్న తదితరులతో పాటు టీడీపీ నాయకులు రంగస్వామి మరికొందరు దర్గా ముందు వాదించుకున్నారు. విషయం తెలుసుకున్న ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ అక్కడికి చేరుకుని ఇరువర్గాలను హెచ్చరించారు. ఈ సమయంలో సీఐ, గిరి మధ్య మాట మాట పెరగగా తనపై ఎలా చేయి చేసుకుంటారని గిరి ఆందోళనకు దిగగా పోలీసులు సముదాయించి పంపించేశారు. ఆ సమయంలో గిరి సీఐ పట్ల దురుసుగా ప్రవర్తించాడని పోలీసులు గిరితో పాటు మరికొందరిని ఆలూరు పోలీసు స్టేషన్‌కు పిలిపించి మందలించి పంపించారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

తుగ్గలి, పత్తికొండ : స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఒకటి రెండు మినహా అన్ని చోట్ల రాజీ ధోరణితో వెళ్లారు. తుగ్గలి మండలంలో 66 పాఠశాలలకు గాను ముక్కెల్ల, పెండేకల్లు ప్రాథమిక పాఠశాలల్లో కమిటీ ఎన్నిక వాయిదా పడింది. ముక్కెల్ల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతు తగినంత లేకున్నా కమిటీని కైవసం చేసుకునేందుకు టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎంఈవో-2 రామవెంకటేశ్వర్లు ఎన్నిక వాయిదా వేశారు. పెండేకల్లు ప్రాథమిక పాఠశాలలో రాజీ కుదరక పోవడంతో ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈఓ చెప్పారు. జాఫ్లాతండా, లక్ష్మీతండాల్లో వెంకటేష్ నాయక్, మంజుల, జొన్నగిరిలో రవి, లక్ష్మన్న, ఆంజినేయులు, అమీన, చక్రవర్తి, ఆర్ కొట్టాలలో సయ్యద్‌మున్నా చైర్మన్, వైఎస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు.

పత్తికొండలో..

పత్తికొండ మండలంలో మొత్తం 46 పాఠశాలలు ఉండగా వాటిలో అటికెలగుండు, ఏపీఆర్ఎస్‌బాలుర పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మిగిలిన చోట్ల ఎన్నిక ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ రమేష్ తెలిపారు.

మద్దికెర : మండలంలోని 26 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ రంగస్వామి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు కమిటీ సభ్యులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు ఎంపికైన చైర్మన్లతో ప్రమాణస్వీకారం చేయించారు.

కేజీబీవీలో ఎన్నిక వాయిదా

వెల్దుర్తి: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ప్రశాంతంగా జరిగాయి. రామళ్లకోట జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీ స్కూళ్లలో టీడీపీలోని వర్గపోరుతో ఉత్కంఠ నెలకొంది. పట్టణంలో 9 పాఠశాలలు ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటినుంచే టీడీపీలోని రెండు వర్గాల పాఠశాలలను పంచుకున్నారు. 8 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. అయితే కేజీబీవీ పాఠశాల ఎన్నికకు హఠాత్తుగా జనసేన మద్దతుదారులు పోటీకి దిగడంతో టీడీపీలోని ఓ వర్గం హతాశయులయ్యారు. జనసేన మద్దతుదారులకు అవకాశమివ్వాలని టీడీపీలోని ఒక వర్గం వారు సపోర్టు చేయడంతో వాదోపవాదాలు జరిగాయి.కోరం లేక ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఓ మంజుల ప్రకటించారు.

చిప్పగిరి: మండలంలో మొత్తం 26 పాఠశాలలుండగా గురువారం 15 పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు జరుగగా మిగిలిన 11 పాఠశాలల్లో వాయిదా పడ్డాయి. ఎన్నిక జరిగిన 15 పాఠశాలల్లో పదవులు ఏకగ్రీవమయ్యాయి. వారిలో నంచర్ల,కుందగుర్తి,దౌలాపురం,బెల్డోణ గ్రామాల్లో చంద్ర,కేసరి రామాంజి ,నెట్టికంటయ్య, బాలరాజు తదితరులో పాటు మరో పది మంది చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎంఈఓ 2 లతీఫ్ తెలిపారు.

నాలుగు పాఠశాలల్లో వాయిదా

కృష్ణగిరి: మండలంలోని 46 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించగా 42 పాఠశాలల్లో ఏకగ్రీవమైనట్లు ఎంఈఓ-2 మద్దయ్య తెలిపారు. చిట్యాల, లక్కసాగరం, తెగదొడ్డి, పందిర్లపల్లె గ్రామాల్లోని పాఠశాలల్లో మాత్రం ఎన్నిక వాయిదా పడినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు పదవుల కోసం పోటీపడటంతో అధికారులు ఎన్నిక వాయిదా వేశారు.



నెల్లిబండలో చైర్మన్‌గా ఎన్నికైన దిద్దికంటి లింగన్నకు పత్రాన్ని అందిస్తున్న అధికారులు

హాలహర్వి: మండలంలో 35 పాఠశాలలకు గానూ 33 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. హాలహర్వి జెడ్పీ హెచ్ఎస్, మల్లికార్జునపల్లి ఎంపీయూపీఎస్‌లో ఎన్నికలు జరగలేదని ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి తెలిపారు.

దేవనకొండ: మండల కేంద్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మాచాపురం, తెర్నెకల్, నెల్లిబండ, బేతపల్లి, సింగాపురం, లక్కందిన్నె, కె.వెంకటాపురం, బుర్రకుంట తదితర గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. నెల్లిబండలో సర్పంచ్ పద్మావతమ్మ ఆధ్వర్యంలో ఏకగ్రీవమయ్యింది.

ఆస్పరి: మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలలకు గాను 50 పాఠశాలల్లో గురువారం ఎన్నికలు జరగగా చిన్నహోతూరు జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల మెయిన్ స్కూల్, ఎస్‌డబ్ల్యూఎఫ్ స్కూల్లో కోరం లేకపోవడం వల్ల ఎన్నికలను వాయిదా వేసినట్లు ఏంఈఓ తిరుమల రావు తెలిపారు. జొహరాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చైర్మన్ పదవి కోసం టీడీపీలోని రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

ఆలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాంది పలికేందుకు రెండేళ్లకోసారి నిర్వహించే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు టీడీపీ నాయకుల కుట్రలు, ప్రలోభాలతో నడిచాయి. విద్యార్థుల తల్లిదండ్రులను బలవంతంగా ఒప్పించి కోరం ఏర్పాటు చేసి చైర్మన్ పదవులు దక్కించుకున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన ఎన్నికల్లో టీడీపీ నేతలు సూచించిన వారికే చైర్మన్ పదవులు కట్టబెట్టారు. ఆలూరు మండలంలోని మొత్తం 51 పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ చిరంజీవి రెడ్డి వెల్లడించారు.

- మండలంలోని కమ్మరచేడు గ్రామంలో టీడీపీకి చెందిన రెండు వర్గాలు ఎన్నికల్లో పోటీ పడ్డారు. టీడీపీకి చెందిన దేవేంద్ర, మద్దిలేటి వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మద్దిలేటి తన వర్గీయులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.

హొళగుంద: మండలంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 39 పాఠశాలలకు గాను 7 పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం తెలిపారు. గొడవలు జరిగే అవకాశాలున్న ముద్దటమాగి ప్రైమరీ, ఎల్లార్తి ప్రైమరీ, ఎల్లార్తి జెడ్పీ హైస్కూళ్లలో పోలీసుల సూచనల మేరకు, అలాగే 50 శాతం కోరం లేని హెబ్బటంహైస్కూల్, హెబ్బటం ప్రైమరీ, వందవాగిలి కన్నడ, తెలుగు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నికలను వాయిదా వేసినట్లు వారు చెప్పారు.

ఎన్నికల్లో టీడీపీ జోక్యం

ఆలూరు: నియోజకవర్గంలో టీడీపీ నేతలు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నిల్లో జోక్యం చేసుకోవడంతో పలుచోట్ల వాగ్వాదాలు, ఎన్నికలు వాయిదాపడటం చోటు చేసుకున్నాయి. చాలా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోకి పచ్చ కార్యకర్తలు నేరుగా వెళ్లి హెచ్ఎం,ఉపాధ్యాయులకు తమ వర్గాలకు చెందిన వారికే మద్దతు ప్రకటించేలా చూడాలని సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో చైర్మన్‌గా విశ్వేశ్వరయ్య వైస్ చైర్మన్‌గా ఎం.లక్ష్మిని టీడీపీ నాయకులు దగ్గరుండి ఎంపిక చేయించారు. కరిడిగుడ్డంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మధ్య వాగ్వివాదం జరిగింది. ఆస్పరి మండలం జోహరాపురం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో చైర్మెన్ ఎంపిక విషయంలో టీడీపీ కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పోలీసులు నచ్చజెప్పినా వినిపించుకోక పోవడంతో వాయిదా వేసినట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.



కరిడిగుడ్డంలో పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక ప్రక్రియ